# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 295 | గురువారం 30 మే 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# టీపీసీసీ చీఫ్‌గా సీతక్క!



- సీఎం రేవంత్ రెడ్డి చొరవతో లైన్ క్లియర్ అయినట్టేనా?
- మహిళకు పీసీసీ పగ్గాలు అప్పగిస్తే పార్టీకి సానుకూలత పెరిగే అవకాశం ఉందని అంచనా
- అద్దంకి దయాకర్, జగ్గారెడ్డి, మధు యాష్కి తదితర సీనియర్లంతా పీసీసీ పీఠం కోసం పట్టుబడుతుండగా?
- సీఎం రేవంత్ టీమ్ కు చెందిన ములుగు సీతక్కకి పీసీసీ ఇస్తే బాగుంటుందని అందరి అభిప్రాయం

వరంగల్

పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ పీసీసీ అధ్యక్షులుగా ఎవరిని నియమిస్తారు అనేది కాంగ్రెస్ వర్గాలలో టెన్షన్ కలిగిస్తోంది. ఇప్పటికీ ఈ సీటు తనకే ఇవ్వాలని భట్టి విక్రమార్క పట్టుబడుతున్న నేపథ్యంలో మరికొందరు సీనియర్ నేతల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే సీఎం రేవంత్ రెడ్డి వర్గానికి చెందిన మహేష్ కుమార్ గౌడ్ పేరు సైతం తెరమీదకు వచ్చింది. ఇప్పటికే సీఎం స్థానం ఓసీ, డిప్యూటీ సీఎం, స్పీకర్ లు ఎస్సీలకు చెందినవారు కాగాఈ సారి పీసీసీ అధ్యక్షుడిగా బీసీకి చెందిన అభ్యర్థిని ఎంచుకోవాలని పార్టీలో ఒత్తిడి పెరిగిపోతుండగా అనూహ్యంగా సీతక్క పేరు తెరపైకి వచ్చింది. ఆదివాసి మహిళకు పార్టీ పగ్గాలు ఇస్తే బాగుంటుందని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఎందుకంటే బీసీ వర్గాల నుంచి మరొకరి పేరు కూడా వినిపిస్తోంది. అలాగే అద్దంకి దయాకర్, జగ్గారెడ్డి, మధు యాష్కి తదితర సీనియర్లంతా పీసీసీ పీఠం కోసం పట్టుబడుతుండగా? సీఎం రేవంత్ టీమ్ కు చెందిన ములుగు సీతక్కకి పీసీసీ ఇస్తే బాగుంటుందని అంతా -మిగతా3లో

# లెక్క తేలింది!

- పాఠశాలలు లేని గ్రామాలు 265
- పిల్లలు లేరనే కారణంతో గత ప్రభుత్వ హయాంలో మూతపడ్డ పాఠశాలలే ఎక్కువ
- మెజార్టీ స్కూళ్లను తిరిగి ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు
- ప్రతీ గ్రామ పంచాయతీలో తప్పకుండా ప్రభుత్వ పాఠశాల ఉండాలన్న సీఎం నిర్ణయం మేరకు ఆ దిశగా ప్రభుత్వం అడుగులు
- నూతన పాఠశాలల ఏర్పాటుపై వివరాలు సేకరించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించిన విషయం విధితమే
- 206 గ్రామ పంచాయతీల్లో స్కూళ్లు అవసరమని అధికారుల గుర్తింపు
- మరో 62 గ్రామాల్లో పిల్లలు లేకపోవడంతో స్కూళ్ల ఏర్పాటు అవసరం లేదని సర్కారుకు నివేదిక




హైదరాబాద్

రాష్ట్రంలో 265 గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు లేవని విద్యాశాఖ అధికారులు లెక్కల ద్వారా తేలింది. పిల్లలు లేరనే కారణంతో గత ప్రభుత్వ హయాంలో మూతపడ్డ పాఠశాలలే ఇందులో ఎక్కువగా ఉన్నాయి. వీటిలో మెజార్టీ స్కూళ్లను తిరిగి ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలో నూతన పాఠశాలలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ప్రతీ గ్రామ పంచాయతీలో తప్పకుండా ప్రభుత్వ పాఠశాల ఉండా లన్న సీఎం నిర్ణయం మేరకు ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.మేరకు అధికారులు రాష్ట్రంలో -మిగతా3లో



## ఆధారాలన్నీ ధ్వంసం చేశాం

- ఫోన్ ట్యాపింగ్ కోసం 17 కంప్యూటర్లు...
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్నీ ధ్వంసం చేశాం
- ధ్వంసం చేసిన ఆధారాలను నాగోల్, మూసారాంబాగ్ మూసీలో పడేసినట్లు వెల్లడి
- సీడీఆర్, ఐడీపీఆర్ డేటా మొత్తాన్ని కాల్చేశామన్న ప్రణీత్ రావు
- ప్రభాకర్ రావు రాజీనామా చేసే ముందు రికార్డులను ధ్వంసం చేయాలని ఆదేశించారని వెల్లడి

హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎప్పటికప్పుడు కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితులు తమ వాంగ్మూలంలో సంచలన విషయాలు వెల్లడిస్తున్నారు. ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు కూడా ఈ కేసులో ఎన్నో అంశాలను తన -మిగతా3లో



## నిప్పుల కుంపటి

- 50 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు..
- భారీ ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్న ఉత్తరాది ప్రజలు
- ఢిల్లీ చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రత రికార్డ్
- రాత్రి సమయంలోనూ 30 డిగ్రీల కంటే ఎక్కువగానే ఉష్ణోగ్రతలు
- ఎండలు తట్టుకోలేక సొమ్మసిల్లిన విద్యార్థులు

# ధాన్యం అమ్ముకుందామంటే కొనేటోడు లేడు..!
# విత్తనాలు కొందామంటే అమ్మేటోడు లేడు!

- గత ఐదారు నెలల నుంచి రైతుల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు
- సాగునీరు లేక పంటలు ఎండిపోయాయి
- పోని పండిన పంటలను కూడా కొనేందుకు ప్రభుత్వం ముందుకురాలేదు.
- చివరకు మిగిలిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనే దిక్కు లేదు
- ఇక ఖరీఫ్ సీజన్‌లో వేసే పంటలకు సంబంధించిన విత్తనాల కోసం రైతులు సీడ్ షాపు ముందు బారులు తీరుతున్నారు.

హైదరాబాద్

కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీటి కష్టాలు మొదల య్యాయి. గత ఐదారు నెలల నుంచి రైతుల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. సాగునీరు లేక పంటలు ఎండిపోయా యి. పోని పండిన పంటలను కూడా కొనేందుకు ప్రభుత్వం ముందుకురాలేదు. దాంతో అకాల వర్షాలకు పంట తడిసిపోయింది. చివరకు మిగిలిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనే దిక్కు లేదు. ఇక ఖరీఫ్ సీజన్‌లో వేసే పంటలకు సంబంధించిన విత్తనాల కోసం రైతులు సీడ్ షాప్పు ముందు బారులు తీరుతున్నారు. విత్తనాల కోసం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతుల బాధలపై ట్వీట్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్టా..? లేనట్టా..? అని ప్రశ్నించా రు. విత్తనాల కోసం రైతులకు ఏమిటీ -మిగతా3లో





## కాంగ్రెస్‌తో పర్మినెంట్ పెళ్లేమీ కాలేదు!

- పొత్తుపై అరవింద్ కేజ్రీవాల్ ఆసక్తికర వ్యాఖ్య
- ప్రస్తుతానికి బీజేపీని ఓడించడమే తమ ప్రధాన లక్ష్యమన్న కేజ్రీవాల్
- ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని పునరుద్ఘాటన
- బీజేపీ గెలిస్తే యోగి ఆదిత్యనాథ్ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని వ్యాఖ్య

# నిప్పుల కుంపటి..



**ఢిల్లీ/పాట్నా:** ఉత్తర భారతంలో భానుగు భగభగ మండిపోతున్నాడు. భారీ ఉష్ణోగ్రతలతో ఉత్తరాది ప్రజలు అల్లాడిపోతున్నారు. 40 డిగ్రీల ఉష్ణోగ్రతే ఎక్కువ అనుకుంటే.. ఇప్పుడు అదికాస్తా 50కి చేరింది. దేశ రాజధాని ఢిల్లీలో ఇవాళ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఢిల్లీ చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రత రికార్డ్ అయ్యింది. మంగేష్పూర్ ప్రాంతంలో 52.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంగళవారం నాడు 49.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రి సమయంలోనూ 30 డిగ్రీల కంటే ఎక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

**రికార్డ్ స్థాయికి చేరిన విద్యుత్ వినియోగం..**

దేశ రాజధాని ఢిల్లీలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు అక్కడి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. దీంతో నగరంలో విద్యుత్ వినియోగం కూడా రికార్డ్ స్థాయికి చేరుకుంది. వాస్తవానికి మునుపెన్నడూ ఈస్థాయిలో విద్యుత్ వినియోగం పెరగలేదు. చరిత్రలో మొదటి సారిగా ఈ ఏడాది ఢిల్లీ విద్యుత్ వినియోగం పెరిగింది. ఏకంగా న8,302 మెగావాట్లకు విద్యుత్ వినియోగం చేరుకుంది. వరుసగా ఏడు రోజుల నుంచి ఢిల్లీలో 7,000 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది.

**బీహార్‌లో తెరుచుకున్న స్కూళ్లు..**

పాట్నా: వేసవి సెలవుల తర్వాత స్కూళ్లు తెరుచుకున్నాయి. అయితే పాఠశాలలకు వచ్చిన విద్యార్థులు ఎండ వేడిని తట్టుకోలేక అల్లాడిపోయారు. పదుల సంఖ్యలో విద్యార్థులు సొమ్మసిల్లిపోయారు. సపర్యలు చేసిన టీచర్లు, ఆ విద్యార్థులను ఆసుపత్రికి తరలించారు. బీహార్‌లో ఈ సంఘటన జరిగింది. వేసవి సెలవులు ముగియడంతో బుధవారం నుంచి ఆ రాష్ట్రంలో స్కూళ్లను తెరిచారు. అయితే ఉష్ణోగ్రత 47 డిగ్రీలు దాటడంతో ఎండ తీవ్రతను విద్యార్థులు తట్టుకోలేకపోయారు. పలు ప్రాంతాల్లోని స్కూళ్లలో విద్యార్థులు సొమ్మసిల్లిపోయారు. షేక్‌పురా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో 16 మంది బాలికలు స్పృహతప్పి పడిపోయారు. టీచర్లు వారికి సపర్యలు చేశారు. ఆటోలు, బైక్‌లపై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ బీహార్‌లో స్కూళ్లను తెరువడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గ్రామస్తులు స్కూళ్లకు వెళ్లి టీచర్లతో ఘర్షణపడ్డారు. అలాగే రహదారిని దిగ్బంధించి నిరసన వ్యక్తం చేశారు. సీఎం నితీశ్ కుమార్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ స్కూళ్లను తెరువడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. మరోవైపు బీహార్‌లో ప్రభుత్వం, ప్రజాస్వామ్యం లేదని, బ్యూరోక్రసీ మాత్రమే ఉందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు. 'ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలకు పైగా ఉన్నాయి. బీహార్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు సరిగా లేవు. కానీ సీఎం చేతుల్లో ఏమీ లేదు' అని మండిపడ్డారు.

# కాంగ్రెస్‌తో పర్మినెంట్ పెళ్లేమీ కాలేదు!



కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ పొత్తు శాశ్వతం కాదని... లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు మాత్రమే తాము ఒక్కటయ్యామన్నారు. బుధవారం 'ఇండియా టుడే' రాజ్ దీప్ సర్దేశాయ్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... జూన్ 4న లోక్ సభ ఎన్నికల ఫలితాల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'ఆమ్ ఆద్మీ పార్టీకి కాంగ్రెస్‌తో పర్మినెంట్ పెళ్లేమీ జరగలేదు. ప్రస్తుతానికి బీజేపీని ఓడించడమే మా లక్ష్యం. ప్రస్తుతం నియంతృత్వం, గూండాగిరిని అంతం చేయడమే మా పాలన లక్ష్యం' అన్నారు. ఢిల్లీలో 7 లోక్ సభ స్థానాల్లోనే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నట్లు తెలిపారు. పంజాబ్‌లో మాత్రం కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రత్యర్థులుగా బరిలోకి దిగాయని గుర్తు చేశారు. పంజాబ్‌లో బీజేపీకి ఎలాగూ మనుగడ లేదన్నారు.

**రాజీనామా చేసే ప్రసక్తి లేదు**

మద్యం పాలసీ కేసులోని మనీ లాండరింగ్ వ్యవహారంలో తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తి లేదని కేజ్రీవాల్ పునరుద్ఘాటించారు. అయితే తాను సీఎం పదవికి రాజీనామా చేయాలని బీజేపీ మాత్రమే కోరుకుంటోందన్నారు. బీజేపీ ముచ్చటగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే మాత్రం దేశంలో ప్రముఖ రాజకీయ నేతలంతా జైళ్లలోకి వెళ్లడం ఖాయమన్నారు. ఇంకా చెప్పాలంటే పుతిన్ సారథ్యంలో రష్యాలో పరిస్థితి ఎలా ఉందో.. దాదాపు అదే పరిస్థితి భారత్‌లో వస్తుందన్నారు. తమ పార్టీకి చెందిన నేతలు సత్యేంద్ర జైన్, మనీష్ సిసోడియాలు బీజేపీలో చేరితే వెంటనే బెయిల్ వస్తుందని... బీజేపీ నేతల నుంచి సందేశాలు వెళ్లినట్లు తన వద్ద సమాచారం ఉందన్నారు. స్వాతి మాలివాల్ ఘటనపై స్పందించేందుకు కేజ్రీవాల్ నిరాకరించారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ రాజకీయ జీవితం ముగిసిపోతుందని జోస్యం చెప్పారు. అమిత్ షా ప్రధాని కావడం ఖాయమన్నారు.

# కాంగ్రెస్ హయాంలో భారీ కుంభకోణాలతో కుంటుపడిన అభివృద్ధి



**భువనేశ్వర్:** దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో భారీ కుంభకోణాలు మినహా ఎలాంటి అభివృద్ధి జరగలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒడిషాలోని కేంద్రపారాలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి మోదీ మాట్లాడారు. గత పదేండ్ల పాలనలో తమ ప్రభుత్వం దేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతి బాట పట్టించిందని చెప్పారు. రాష్ట్రాన్ని లూటీ చేస్తున్న పాలకులకు బుద్ధి చెప్పాలని ఒడిషా ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈసారి ఒడిషాలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని నెలకొల్పాలని ప్రజలు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. ఒడిషాలోనే కాకుండా దేశంలో మరోసారి పటిష్ట ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**నవీన్ పట్నాయక్ ఆరోగ్యానికి ఏమైంది? కుట్ర కోణం ఉందా?**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒడిశాలో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆరోగ్య పరిస్థితిని ప్రస్తావించారు. అకస్మాత్తుగా ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడం వెనుక కారణం ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. నవీన్ పట్నాయక్ ఇటీవల ఒక ర్యాలీలో పాల్గొన్నప్పుడు ఆయన చేయి వణుకుతూ కనిపించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమంలో వైరల్ అయిన నేపథ్యంలో మోదీ తాజా వ్యాఖ్యలు చేశారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం వస్తే నవీన్ పట్నాయక్ ఆరోగ్యం ఆకస్మికంగా దిగజారడంపై కారణాలను తెలుసుకునేందుకు ఒక కమిటీని వేస్తామని మోదీ చెప్పారు. "నవీన్ బాబు సన్నిహితులు ఎప్పుడు నన్ను కలిసినా ఆయన ఆరోగ్యం గురించే మాట్లాడుతున్నారు. ఆయన ఇప్పుడు సొంతంగా ఏమీ చేసుకునే పరిస్థితిలో లేరని చెబుతున్నారు. ఆయన ఆరోగ్యం క్షీణించడం వెనుక కుట్ర ఏదైనా ఉండవచ్చనే అనుమానాలను కూడా వారు వ్యక్తం చేస్తున్నారు" అని మోదీ తెలిపారు. నవీన్ బాబు పేరును ఉపయోగించుకుని అధికారాన్ని అనుభవిస్తున్న లాబీ ఈ 'కుట్ర' వెనుక ఉండవచ్చనే అనుమానాలను ప్రధాని వ్యక్తం చేశారు. ఈ మిస్టరీని వెలికి తీయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

**అసలేం జరిగింది?**

నవీన్ పట్నాయక్ ఇటీవల ఓ సభలో ప్రసంగిస్తుండగా ఆయన ఎడమ చేయి వణికింది. పట్నాయక్‌కు సన్నిహితుడుగా పేరున్న తమిళనాడుకు చెందిన బీజేడీ నేత వీకే పాండియన్ నవీన్ వణుకుతున్న చేతిని కనబడకుండా సరిచేశారు. ఇందుకు సంబంధించిన ఓ వీడియో సామాజిక మాధ్యమంలో హల్‌చల్ చేసింది. బీజేపీ నేత, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ దీనిపై ఒక ట్వీట్ చేస్తూ, నవీన్ చేతి కదలికలను సైతం కంట్రోల్ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. దీనిపై పట్నాయక్ సైతం వెంటనే స్పందించారు. సమస్య కాని దానిని సమస్య చేయడం బీజేపీకి బాగా తెలుసునని, అందుకే తన చేతుల గురించి చర్చ లేవనెత్తారని తప్పుపట్టారు. ఓట్ల కోసం బీజేపీ చేస్తున్న కుయుక్తులు ఎంతమాత్రం పనిచేయవని స్పష్టం చేశారు. ఒడిశాలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు నాలుగు విడతలుగా మే 13 నుంచి జూన్ 1 వరకూ జరుగుతున్నాయి. జూన్ 4న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

**బెంగాల్‌లో ఎన్నడూలేనంతగా కమల ప్రభం'జనం'**

పశ్చిమబెంగాల్ వ్యాప్తంగా ఈసారి కనీవినీ ఎరుగ నంతగా బీజేపీ కి ప్రజల మద్దతు కనిపిస్తోందని, ప్రజల ఆదరణ అనూహ్యంగా ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పశ్చిమబెం గాల్‌లోని మధురాపూర్ బుధవారంనాడు జరిగిన భారీ బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, కోల్‌కతాలో జరిపిన రోడ్‌షోలో ప్రజలు చూపిన ఆదరణ ఎన్నటికీ మరిచిపోనని చెప్పారు. "మరోసారి మోదీ సర్కార్ వస్తుంది" అనే స్పష్టమైన సందేశాన్ని ప్రజలు ఇచ్చారని అన్నారు. '2024 ఎన్నికల్లో కోల్‌కతాలో మీతో పాల్గొంటున్న చివరి సమావేశం ఇది. ఇక్కడి నుంచి ఒడిశా, పంజాబ్ వెళు న్నాను. గురువారం సాయంత్రంతో ప్రచారం ముగుస్తుంది. ఇవాళ మీ నుంచి వచ్చిన స్పందన చూస్తుంటే మీ ఆశీస్సులు నావెంటే ఉన్నాయని బలంగా నమ్ముతున్నాను" అని ప్రజలను ఉద్దేశించి మోదీ అన్నారు. 'వికసిత్ భారత్' దిశగా ఇండియా పయనం సాగిస్తోందని, అందుకోసం వికసిత్ బెంగాల్ చాలా కీలకమని చెప్పారు. ఇది సాధ్యం కావాలంటే ఇదే విజన్ ఉన్న ఎంపీలను గెలిపించుకోవాలని, తద్వారా తమకు ఆశీస్సులు అందించాలని ప్రధాని కోరారు.

**చొరబాటుదారులకు సుస్థిర స్థానం కల్పించేందుకే..**

బుజ్జగింపు రాజకీయాల కోసం తృణమూల్ కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగంపై దాడి చేస్తోందని ప్రధాని మండిపడ్డారు. ఓబీసీల హక్కులను ఊడలాక్కుని ముస్లింలకు రిజర్వేషన్ కల్పించాలనుకుంటోందనన్నారు. ఓబీసీ సర్టిఫికెట్లను కోల్‌కతా కోర్టు రద్దు చేసిందని, జూన్ 1న వికసిత్ బెంగాల్‌కు ప్రజల ఓట్లే కీలకమని చెప్పారు. బెంగాల్ ప్రజలకు ఉద్దేశించిన అవకాశాలను చొరబాటుదారుల పరం కానున్నాయని మోదీ హెచ్చరించారు. సీఏఏను టీఎంసీ ఎందుకు టీఎంసీ వ్యతిరేకిస్తోందని ప్రశ్నించారు. చొరబాటుదారులకు ఇక్కడ సుస్థిరస్థానం కల్పించాలనే ఆలోచనే ఇందుకు కారణమని మోదీ వివరించారు.

## ఢిల్లీలో నీటిని వృథా చేస్తే రూ.2000 జరిమానా

**అధికారులకు మంత్రి ఆదేశాలు**

**దేశ రాజధానిలో నీటి సమస్యను అధిగమించేందుకు ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయం**

**కార్లను కడగడం, ట్యాంకర్ల ఓవర్ ఫ్లో, వాణిజ్యపరమైన అవసరానికి వినియోగిస్తే కఠిన చర్యలు**

**ఇందుకోసం 200 బృందాలను తక్షణమే ఏర్పాటు చేయాలని మంత్రి అతిశీ ఆదేశాలు**



**ఢిల్లీ :** నీటి సమస్యను అధిగమించేందుకు ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎండ తీవ్రత, పలుచోట్ల తాగునీటి కొరత వంటి పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కీలక చర్యలకు ఉపక్రమించింది. నీటిని వృథా చేస్తే రూ.2000 జరిమానా విధించనున్నట్లు మంత్రి అతిశీ పేర్కొన్నారు. నీటి పైపులతో కార్లను కడగడం, వాటర్ ట్యాంకర్లు ఓవర్ ఫ్లో కావడం, వాడుక నీటిని నిర్మాణ, వాణిజ్యపరమైన అవసరాల కోసం వినియోగించడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఓ వైపు వేసవి కాలం.. మరోవైపు ఢిల్లీలో మంచినీటి సరఫరాను హరియాణా నిలిపివేసింది. దీంతో న్యూఢిల్లీలో తీవ్ర మంచి నీటి ఎద్దడి ఏర్పడింది. దాంతో దేశ రాజధానిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అలాంటి వేళ మంచి నీటి వృథా చేయకుండా ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. మంచి నీటిని చాలా పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు సూచించింది. ఓ వేళ నీటిని వృథా చేస్తే.. రూ.2 వేలు ఫైన్ వేస్తామని ప్రకటించింది. ఆ క్రమంలో మంచి నీటితో పైపుల ద్వారా వాహనాలను కడగవద్దని.. నివాస గృహాలకు కేటాయించిన మంచి నీటి కనెక్షన్లను వాణిజ్య అవసరాలకు వినియోగించ కూడదని.. వాటర్ ట్యాంక్‌ల ద్వారా మంచి నీటి సరఫరాలో.. నీరు వృథాను అరికట్టాలని ప్రజలకు సూచించింది. అందుకోసం ఢిల్లీ మహానగరంలో 200 బృందాలను రంగంలోకి దింపినట్లు ఆప్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ బృందాలు ఉదయం 8.00 గంటల నుంచి నీటి వృథా ఎక్కడ జరుగుతున్నా వాటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు ఫైన్ సైతం విధిస్తాయని తెలిపింది. ఇక నగరంలో అక్రమంగా నీటి కనెక్షన్లు ఉంటే.. వాటిని వెంటనే నిలిపి వేయాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించింది. ఈ మేరకు ఢిల్లీ మంచి నీటి శాఖ మంత్రి అతిషి బుధవారం ప్రకటించారు. మరోవైపు సార్వత్రిక ఎన్నికల వేళ.. న్యూఢిల్లీలో మంచి నీటి కొరత సృష్టించేందుకు బీజేపీ కొత్త కుట్రకు తెర తీసిందంటూ ఆప్ నాయకురాలు, ఢిల్లీ మంత్రి అతిషి ఇటీవల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలోనే హరియాణా నుంచి ఢిల్లీకి మంచి నీటి సరఫరా నిలిచిపోయిందంటూ ఆమె విమర్శించిన విషయం విధితమే.

## జూన్ 4న యువరాజుల డైలాగ్ ఇదే! : అమిత్ షా




జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం తమ ఓటమికి ఈవీఎంలే కారణమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానిస్తారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా అమిత్ షా బుధవారం యూపీలోని మహరాజ్‌గంజ్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు అనంతరం రాహుల్, అఖిలేష్‌లు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తమ ఓటమికి ఈవీఎంలే కారణమని నిందిస్తారని చెప్పారు. తమ ఓటమి నెపాన్ని ఈవీఎంలపై నెట్టివేయాలని వారు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చారని ఎద్దేవా చేశారు. పీఓకే భారత్‌లో అంతర్భాగమని, పీఓకేను బీజేపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని అమిత్ షా పునరుద్ఘాటించారు. పాకిస్తాన్ వద్ద అణుబాంబు ఉందని, పీఓకే గురించి మాట్లాడవద్దని కాంగ్రెస్ దేశాన్ని భయపెడుతున్నదని అన్నారు. తాము బీజేపీ వ్యక్తులమని, అణుబాంబులకు భయపడబోమని, పీఓకేను తిరిగి వెనక్కితీసుకొస్తామని ఆయన స్పష్టం చేశారు.

## ప్రజ్వల్ రేవణ్ణ అరెస్ట్‌కు రంగం సిద్ధం!



**బెంగళూరు :** లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అరెస్ట్‌కు రంగం సిద్ధమైంది. మే 31వ తేదీ అంటే శుక్రవారం తెల్లవారుజామున జర్మనీ నుంచి ప్రజ్వల్ రేవణ్ణ బెంగళూరు చేరుకోనున్నారు. ఆ క్రమంలో కెంపె గౌడ ఎయిర్ పోర్ట్‌లో ప్రజ్వల్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు తాను మే 31వ తేదీ ఉదయం 10.00 గంటలకు సిట్ అధికారుల ముందు హాజరవుతానంటూ ప్రజ్వల్ ఇటీవల.. ఓ వీడియో విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో తాను పోలీసులకు సహకరిస్తానని స్పష్టం చేశారు. తనకు న్యాయ వ్యవస్థపైన, చట్టాలపైన నమ్మకం ఉందని చెప్పారు. అయితే తనపై తప్పుడు కేసు పెట్టారంటూ ప్రజ్వల్ ఈ సందర్భంగా ఆ వీడియోలో ఆరోపించిన విషయం విధితమే. మరోవైపు మే 30వ తేదీ ఉదయం జర్మనీ నుంచి బెంగళూరుకు ప్రజ్వల్ బయలుదేరనున్నారని తెలుస్తుంది. ఇక ఈ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన ప్రజ్వల్ వెంటనే జర్మనీ వెళ్లిపోయారు. ఇంకోవైపు సార్వత్రిక ఎన్నికల వేళ ప్రజ్వల్ అంశం.. కర్ణాటకలోని అధికార కాంగ్రెస్ పార్టీకి ఆస్త్రంగా మారింది. అదీకాక లోక్‌సభ ఎన్నికల బరిలో బీజేపీ, జేడీఎస్ కలిసి పోటీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ యా పార్టీలపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. దీంతో ప్రజ్వల్‌ను పార్టీ నుంచి జేడీ (ఎస్) సస్పెండ్ చేసింది. మరోవైపు ప్రజ్వల్ అంశంపై జేడీ (ఎస్) సీనియర్ నాయకుడు, మాజీ ప్రధాని దేవగౌడ్ కుటుంబంపై విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో దేవగౌడ.. తన మనవడు ప్రజ్వల్‌కు బహిరంగ లేఖ రాసి.. ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ప్రజ్వల్ ఎక్కడ ఉన్నా వెంటనే తిరిగి వచ్చి.. పోలీసుల ఎదుట హాజరు కావాలన్నారు. ఈ విషయంలో తన సహనాన్ని పరీక్షించవద్దంటూ ప్రజ్వల్‌కు దేవగౌడ చురకలంటించారు.

## నదిలో 10 కిలోమీటర్లు కొట్టుకుపోయింది.. కానీ బ్రతికే ఉంది

కొల్లామ్: కేరళలోని కొల్లామ్‌కు చెందిన 64 ఏళ్ల మహిళ కల్లడ నదిలో కొట్టుకుపోయింది. నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండగా ఆమె సుమారు పది కిలోమీటర్ల దూరం ఆ నీటిలో తేలుకుంటూ వెళ్లిపోయింది. నది ఒడ్డున బట్టలు జాడిస్తూ కాలు జరాడంతో శ్యామలమ్మ నదీ ప్రవాహంలో పడిపోయింది. అయితే ఇటీవల వర్షాలు కురుస్తున్న కారణంగా.. నదిలో నీరు తీవ్ర స్థాయిలో ప్రవాహిస్తున్నది. ఈత కొట్టడం తెలియని శ్యామలమ్మ.. నది నీటిలో పడిన తర్వాత ఆ ప్రవాహంలో కొట్టుకుపోయింది. నీరు వేగంగా ప్రవహిస్తుండడంతో.. తన ముఖాన్ని పైకి లేపి.. ఆ ప్రవాహంలోనే వెళ్లిపోయింది. చెట్టియారజికత్త, జాకడావు, కున్నతూరు బ్రిడ్జ్‌లను దాటుకుంటూ ఆమె కొట్టుకుపోయింది. నీటిలో కొట్టుకుపోతున్న ఆమెను కున్నతూరు బ్రిడ్జ్ నుంచి కొందరు వీడియో కూడా తీశారు. కానీ ఆమె అప్పటికే మృతిచెంది ఉంటుందని అనుమానించారు. అయితే అదృష్టం కొద్దీ.. చేరుపొయక వద్ద ఉన్న మంగలసెరి ఘాట్‌లో ఉన్న నది పొదల్లో ఆమె చిక్కుకున్నది. ఓ తీగ చెట్టును పట్టుకుని మూలుగుతున్న ఆమె అరుపులను స్థానికులు విన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పడవలో వెళ్లి ఆమెను రక్షించారు. కల్లడ నది రూట్లో ఉన్న ఉరులుమాల వద్ద ఉన్న చెట్ల తీగల్లో శ్యామలమ్మ ట్రాపైంది. ఆమెను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు ప్రైమరీ వైద్య చికిత్స చేయించారు. ఆమెకు ఎటువంటి మేజర్ గాయం కాలేదని తేల్చారు.

# టీపీసీసీ చీఫ్‌గా సీతక్క!

-మొదటి పేజి తరువాయి

అనుకుంటున్నారు. అయితే ఈ మేరకు సీతక్కకు అధిష్టానం నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు సమాచారం. ఇక అధిష్టానం లాంఛనంగా సీతక్క పేరు ప్రకటించడమే తరువాయి. మహిళకు పీసీసీ పగ్గాలు అప్పగిస్తే పార్టీకి సానుకూలత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పీసీసీ పదవి కోసం పోటీ పడుతున్న ఇతర నేతలు సైతం సీతక్క అనగానే ఏకాభిప్రాయానికి వస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఎందుకంటే సీతక్కపై అందరికీ సదభిప్రాయమే ఉంది. పార్టీ కోసం ఆమె కష్టపడి పనిచేస్తారనే నమ్మకం ప్రతి ఒక్కరిలోనూ ఉన్నాయి. సీతక్కకు పార్టీ పగ్గాలు అప్పగించడం ద్వారా ఎస్టీ సామాజిక వర్గం ఆదరణ పొందడమేగాకుండా, మహిళల నుంచి కూడా పార్టీకి సానుకూలత ఉంటుందని కాంగ్రెస్ పార్టీ లెక్కలు వేసుకుంటోంది. పైగా పీసీసీ చీఫ్ గా పదవి ఇవ్వడం ద్వారా తెలంగాణ కాంగ్రెస్ కు తొలి ఆదివాసి మహిళగా గుర్తింపు ను ఇచ్చినట్లవుతుందని అధిష్టానం కూడా భావిస్తున్నట్లు సమాచారం. . ఆమెకు పీసీసీ పగ్గాలు అప్పగిస్తే ఎవరి నుంచి వ్యతిరేకత రాదని కొందరి వాదన. అందుకే సీతక్క పేరును కాంగ్రెస్ పరిశీలిస్తుందని గాంధీ భవన్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.సీతక్క ఈ పేరు రెండు తెలుగురాష్ట్రాలలోనూ సుపరిచితమే. ఈమె



అసలు పేరు ధనసరి అనసూయ సీతక్క. కానీ సీతక్కగానే ఆమె చిరపరిచితురాలు. పొలిటికల్ సైన్స్‌లో ఆమె ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. సీతక్క తల్లిదండ్రులు సమ్మయ్య, సమ్మక్క. సీతక్కకు ఒక కుమారుడు ఉన్నారు. పేరు సూర్య. గతంలో జనశక్తి గ్రూపులో దళసభ్యురాలుగా ఉన్న ఆమె, తను ప్రేమించిన శ్రీరాములునే పెళ్ళి చేసుకున్నారు. కానీ తరువాత విడిపోయారు. ఏ మార్పు కోసం తాను అడవి బాట పట్టానో, అడవిని వీడాకా కూడా తన లైను మార్చుకోలేదని ఆమె చెప్తుంటారు.అనసూయ మావోయిస్ట్ పార్టీలో చేరినప్పుడు పదో తరగతి చదువుతున్నారు. సుమారు రెండు దశాబ్దాల పాటు మావోయిస్ట్ పార్టీలో పనిచేసిన సీతక్క తరువాత జనజీవన స్రవంతిలోకి వచ్చారు. న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసేందుకు లా కూడా చదివారు.సీతక్క తెలుగుదేశం పార్టీ తరపున 2004లో ములుగు నుంచి పోటీ చేశారు. కానీ కాంగ్రెస్ అభ్యర్థి పోడెం వీరయ్య చేతిలో ఓడిపోయారు. తరువాత 2009లో వీరయ్యపైనే గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2014 ఎన్నికల్లో టీడీపీ తరపునే పోటీ చేశారు. కానీ టీఆర్ఎస్ అభ్యర్థి చందూలాల్ చేతిలో ఓటమిపాలయ్యారు. 2018లో సీతక్క కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2018, 2023 ములుగు నుంచే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. సీతక్క నిరాండబరత, సామాన్యుల్లో సామాన్యురాలిగా కలిసిపోయే స్వభావమే ఆమెకు ప్రత్యేకతను తీసుకువచ్చిందంటారు రాజకీయ విశ్లేషకులు.అయితే, పార్టీ పగ్గాలను సీతక్క చేపట్టేందుకు అంగీకరిస్తుందా..? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ పీసీసీగా ఒప్పుకుంటే మంత్రి పదవిలో కొనసాగుతారా? లేక రాజీనామా చేస్తారా అని చర్చలు జరుగుతున్నాయి.

# లెక్క తేలింది!

-మొదటి పేజి తరువాయి

మూతపడ్డ పాఠశాలల వివరాలు సేకరించడంతో నిమగ్నమయ్యారు. దీనిలో భాగంగానే డిసెంబరులో విద్యాశాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశం సందర్భంగా నూతన పాఠశాలల ఏర్పాటుపై వివరాలు సేకరించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించిన విషయం విధితమే. ఏ ఒక్క బాలుడు గానీ, బాలిక గానీ చదువు కోసం ఇతర గ్రామాలకు వెళ్లే పరిస్థితి ఉండకూడదని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో గత నాలుగు నెలలుగా విద్యాశాఖ అధికారులు మూసివేసిన పాఠశాలల పునరుద్ధరణకు కసరత్తులు చేస్తున్నారు. రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలు ఉండగా, 265 గ్రామపంచాయతీల్లో పాఠశాలలు లేవని తేలింది. వీటిలో 206 గ్రామ పంచాయతీల్లో స్కూళ్లు అవసరమని అధికారులు గుర్తించారు. మరో 62 గ్రామాల్లో పిల్లలు లేకపోవడంతో స్కూళ్ల ఏర్పాటు అవసరం లేదని సర్కారుకు నివేదిక అందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పిల్లలు లేరనే కారణంతో పాఠశాలలను మూసివేస్తే.. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభించేందుకు మొగ్గుచూపడంపై పలు ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అలాగే, మూతపడ్డ స్కూళ్లనూ రీఓపెన్ చేయించేందుకు సర్కారు ప్రణాళికలు రూపొందిస్తోంది.రాష్టంలో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 24 కొత్త స్కూళ్లను ప్రారంభించనున్నారు. కరీంనగర్, యాదాద్రి భువనగిరి జిల్లాలో 21 చొప్పున, వరంగల్‌లో 16 కొత్త స్కూళ్లను ప్రారంభించనున్నారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 14 పంచాయతీల్లో స్కూళ్లు లేవని, ఇందులో 11 గ్రామపంచాయతీల్లో కొత్త స్కూళ్లు




అవసరం లేదని అధికారులు గుర్తించారు. వరంగల్ జిల్లాలో 24 జీపీల్లో స్కూళ్లు అందుబాటులో లేకపోగా, ఇందులో 12 గ్రామపంచాయతీల్లో అసలు కొత్త స్కూళ్లే అవసరం లేదని వెల్లడించారు.హైదరాబాద్, గద్వాల, మేడ్చల్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలు మినహా ప్రతి జిల్లాలోనూ ఒకటి ఆపై స్కూళ్లు మూతపడ్డాయి. గ్రామాల్లో కొత్త స్కూళ్లను ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై కూడా అధికారులు కసరత్తు చేస్తున్నారు. జూన్‌లో జరిగే బడిబాటలో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల్లో పిల్లలను గుర్తించి, వారికి స్కూళ్లలో అడ్మిషన్లు ఇప్పించాలని భావిస్తున్నారు. అందుబాటులో ఉన్న టీచర్లనే కొత్త స్కూళ్లలో సర్దుబాటు చేయాలని యోచిస్తున్నారు.విద్యా శాఖపై సీఎం నిర్వహించిన సమీక్షలో భాగంగా గ్రామంలో పాఠశాల ఉండాలనే నిర్ణయంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పుడు వివరాలు సేకరిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఎక్కడ పాఠశాల అవసరం? పిల్లల ఎన్ రోల్ తక్కువగా ఉండి.. ఉపాధ్యాయులు ఎక్కువగా ఉండి ఆ గ్రామానికి దగ్గరగా ఉంటే సదరు పాఠశాలలో ఆ ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేసేలాగా కసరత్తు చేస్తున్నాం. ప్రస్తుతం 1748 పాఠశాలల్లో జీరో ఎన్ రోల్ వుంది.

## ప్రజల పోరాటం, త్యాగాలు ప్రతిబింబించేలా రాష్ట్ర చిహ్నం

-మొదటి పేజి తరువాయి

తెలంగాణ రాష్ట్ర గీతం రూపకల్పన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. తెలంగాణ రాష్ట్రం అవిర్భవించి దశాబ్దం పూర్తైన నేపథ్యంలో కొత్తగా ఒక గీతాన్ని రూపొందించాలని సంకల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వం.ఈ గీతం రూపకల్పనపై కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణితో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష నిర్వహించారు. వీరితో పాటు ఈ సమావేశానికి మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, రఘు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రాంచంద్రు నాయక్, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే సంపత్, ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్, తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో జరిగింది. అయితే దీనిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ విమర్శిస్తోంది. ఇప్పటికే తెలంగాణ వాహన రిజిస్ట్రేషన్ లో టీఎస్ గా ఉండే అక్షరాలను టీజీగా మార్పులు చేసింది. మరోవైపు ఆర్టీసీ లోగో, పేరును కూడా మరుస్తూ సంచలన నిర్ణయాలు తీసుకున్నారు సీఎం రేవంత్. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ధి దినోత్సవం సందర్భంగా ఈ రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించనుంది.

## రేవంత్ మౌనానికి కారణమదేనా?

**హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ సంచలన కామెంట్స్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తులో అనేక సంచలనాత్మక విషయాలు బయట పడుతున్నాయని.. ఈ వ్యవహారంపై రేవంత్ సర్కార్ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. తప్పు చేస్తే జైలుకు పంపిస్తామని రేవంత్ చెప్పారని.. ఇన్ని సంచలన విషయాలు బయటకు వస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు స్కామ్‌పై దర్యాప్తు, విచారణ అన్నారు.. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పత్రాల లీక్‌పై చర్యలు అన్నారు.. డ్రగ్స్‌పై చర్యలన్నారు.. ఏవీ పట్టించుకోవడం లేదని రేవంత్ సర్కార్ తీరును లక్ష్మణ్ తూర్పారబట్టారు. పోలీసు అధికారులు కేసీఆర్ ప్రమేయంతోనే జరిగిందని చెప్పారని.. వాంగ్మూలంలో స్పష్టంగా పేర్కొన్నారని లక్ష్మణ్ గుర్తు చేశారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో ఒక మాఫియాను నడిపించారని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రయోజనాల కోసం నాయకులు, ఇతర వ్యక్తుల ఫోన్లను ట్యాపింగ్ చేశారని లక్ష్మణ్ విమర్శించారు. చివరికి జడ్జిల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు అరెస్ట్ అయిన అధికారులు చెబుతున్నారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితుడిగా ఉన్న సీఎం రేవంత్.. ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని లక్ష్మణ్ ప్రశ్నించారు. ఢిల్లీ ఒత్తిళ్లకు లొంగిపోయారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అక్రమ సంపాదన డబ్బులను తరలించేందుకు పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేశారంటూ లక్ష్మణ్ విమర్శించారు. కేసీఆర్, ఆయన అల్లుడు హరీష్ రావుల పేర్లను పోలీసు అధికారులు తమ వాంగ్మూలంలో చెప్పారని లక్ష్మణ్ ఉటంకించారు. వామపక్ష తీవ్రవాదానికి సంబంధించిన డేటాను కూడా ధ్వంసం చేశారన్నారు. దేశ భద్రతకు విఘాతం కలిగించేలా చేశారని ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి తమ పార్టీ హైకమాండ్ ఒత్తిడికి లొంగారా? అందుకే ఫోన్ ట్యాపింగ్‌పై చర్యలు తీసుకోవడం లేదా? అని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడేనని.. ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం అవుతుందన్నారు బీజేపీ ఎంపీ. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం ఫేక్ సినిమా డ్రామా అని తాను ముందే చెప్పానన్నారు. లిక్కర్ కేసులో కవితను గట్టెక్కించేందుకు ఎమ్మెల్యేల కేసు బయటకు తీసుకొచ్చారన.. దారుణమైన స్థితికి కేసీఆర్ దిగజారాడని లక్ష్మణ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ద్రోహానికి పాల్పడిందని.. నీచమైన స్థాయికి దిగజారిందంటూ మండిపడ్డారు లక్ష్మణ్. రేవంత్‌పై ఢిల్లీ పెద్దల ఒత్తిడి లేదంటే వెంటనే ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులు, పాత్రదారులపై చర్యలు తీసుకోవాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. అంతేకాదు.. ఈ కేసును వెంటనే సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ జరిగితేనే న్యాయం జరుగుతుందన్నారు. కేసీఆర్.. దిగజారుడు రాజకీయాలు చేశారని.. వ్యక్తిగత స్వేచ్ఛను హరించారంటూ ఫైర్ అయ్యారు.

**అందే శ్రీ పాటను స్వాగతిస్తున్నాం..**

తెలంగాణ రాష్ట్ర పాటగా అందే శ్రీ పాటను స్వాగతిస్తున్నామని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ప్రకటించారు. అందే శ్రీ పాట విషయంలో తమకు ఎలాంటి ఇబ్బందీ లేదన్నారు. ఒక గొప్ప పాటను అందే శ్రీ రాశారని కొనియాడారు. కేసీఆర్ అరాచకాలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయని.. ఎంపీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ డబుల్ డిజిట్ వస్తుందని లక్ష్మణ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాల తరువాత తెలంగాణ రాష్ట్రంలో అనేక రాజకీయ మార్పులు రాబోతున్నాయన్నారు. ఐదేళ్లు కాంగ్రెస్ కొనసాగాలని ప్రజాస్వామ్య వాదిగా కోరుకుంటున్నానని.. సీఎం రేవంత్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లక్ష్మణ్ అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ ఇరుక్కోవడం ఖాయం... ఆయన పాత్రే కీలకం

ట్యాపింగ్‌పై కేంద్రం స్పందించి సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్

ఈ అంశం కేంద్రం పరిధిలోకి వస్తుందని వ్యాఖ్య

బీఆర్ఎస్ అని పేరు మార్చడమే కేసీఆర్ పట్ల భస్మాసుర హస్తంగా మారిందన్న జీవన్ రెడ్డి

కేసీఆర్ అధికారం కోల్పోవడానికి ఇది కూడా కారణమైందని వెల్లడి

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ జరిగితే కేసీఆర్ ఇరుక్కోవడం ఖాయమని... ఇందులో ఆయన పాత్ర కీలకమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ... ట్యాపింగ్ విషయంపై కేంద్రం స్పందించి సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ అంశం కేంద్రం పరిధిలోకి వస్తుందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మేడిపల్లి సత్యం, జువ్వాడి నర్సింగరావు, కవ్వంపల్లి సత్యనారాయణ ఫోన్లు ట్యాప్ అయ్యాయనే అనుమానాలు ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ అని పేరు మార్చడమే కేసీఆర్ పట్ల భస్మాసుర హస్తంగా మారిందని విమర్శించారు. కేసీఆర్ అధికారం కోల్పోవడానికి ఇది కూడా కారణమైందన్నారు. ప్రధాని మోదీ మత రాజకీయాలు చేస్తున్నారని బీజేపీపై ఆయన విమర్శలు గుప్పించారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాగానే ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు మార్పు చేయడంతో పాటు వెనుకబడిన అన్ని వర్గాలకు... మతాలకు, అతీతంగా రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర గీతం నిర్మాణంలో మ్యూజిక్ డైరెక్టర్‌గా కీరవాణి ఉండటాన్ని బీఆర్ఎస్ తప్పుపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ఆంధ్రా సినిమాలకు పన్ను మినహాయింపు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు.

## ధాన్యం అమ్ముకుందామంటే కొనేటోడు లేడు..! విత్తనాలు కొందామంటే అమ్మేటోడు లేడు..!!

-మొదటి పేజి తరువాయి




వెతలు..? అని నిలదీశారు. వ్యవసాయ పరిస్థితులను పర్యవేక్షించాలని వ్యవసాయ మంత్రి ఎక్కడ..? ముందుచూపు లేని ముఖ్యమంత్రి జాడేది..? అని నిలదీశారు కేటీఆర్. నిన్న.. ధాన్యం అమ్ముకుందామంటే కొనేటోడు లేడు..! నేడు.. విత్తనాలు కొందామంటే అమ్మేటోడు లేడు..!! పాలన పూర్తిగా పడకేసిందని చెప్పడానికి.. ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలని కేటీఆర్ పేర్కొన్నారు. తెల్లవారుజామున 4 గంటలకు లైన్‌లో నిలబడితే.. సాయంత్రం 4 గంటల వరకూ విత్తనాలు ఇవ్వలేరా..? గత పదేళ్లపాటు.. 10 నిమిషాల్లో అందిన విత్తనాలు.. ఇప్పుడు 10 గంటల పాటు పడిగాపులు పడినా అందించలేరా ?? అని నిలదీశారు కేటీఆర్. దేశం కడుపునింపే స్థాయికి ఎదిగిన తెలంగాణ.. అన్నదాతకే తిండితిప్పలు లేకుండా చేస్తారా ?? కాంగ్రెస్ వచ్చింది.. కాటగలిసినం అంటున్న.. అన్నదాతలను ఇంకా అరిగోస పెట్టకండి..!! లేకపోతే.. రైతుల సంఘటిత శక్తిలో ఉన్న బలాన్ని.. కాంగ్రెస్ ప్రభుత్వం చవిచూడక తప్పదు..!! అని కేటీఆర్ హెచ్చరించారు.

## కవితకు మరో షాక్..

-మొదటి పేజి తరువాయి

అనుబంధ ఛార్జిషీట్‌పై రౌస్ అవెన్యూ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. కవితపై దాఖలైన ఛార్జిషీట్‌ను కోర్టు పరిగణలోకి తీసుకోవటమే కాకుండా.. జూన్ 3వ తేదీన ఛార్జిషీట్‌లో పేర్కొన్న నిందితులందరూ కోర్టు ఎదుట హాజరు కావాలంటూ సమన్లు జారీ చేసింది. దీంతో వచ్చే నెల 3న కవితను జైలు అధికారులు కోర్టులో ప్రవేశపెట్టున్నారు. గోవా ఎన్నికల సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీ తరపున ప్రచారం చేసిన దామోదర శర్మ, ప్రిన్స్ కుమార్, చన్ ప్రీత్ సింగ్, అరవింద్ సింగ్‌లను చార్జిషీట్‌లో ప్రస్తావించారు. ఈ అనుబంధ ఛార్జిషీట్‌లో అన్ని వివరాలు వెల్లడించారు. మద్యం పాలసీ కేసులో డబ్బు గోవాకు ఎలా చేరిందో ఇందులో ఈడీ పేర్కొ

**ఈడీ వాదన ఇదే..**

విచారణకు తగిన సాక్ష్యాలు ఉన్నాయంటూ న్యాయస్థానంలో ఈడీ చేసిన వాదనలను విన్న ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా.. తీర్పును రిజర్వ్ చేశారు. ఈరోజు ఈడీ ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకుంటున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. మరోవైపు కవిత బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టులో మంగళవారం వాదనలు పూర్తయ్యాయి. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు జడ్జి స్వర్ణకాంత శర్మ తీర్పును రిజర్వు చేశారు.

**జూన్3న కోర్టుకు కవిత..**

రౌస్ అవెన్యూ కోర్టు ఈడీ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకుని.. నిందితులుగా ఉన్న వారందరిని విచారణకు పిలవడంతో ఈకేసు మరెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి. కోర్టు ఆదేశాలతో కవితతో సహా నిందితులంతా కోర్టులో హాజరుకావాల్సి ఉంటుంది. మరోవైపు జూన్4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న విషయం తెలిసిందే.

## మేడిగడ్డలో కొనసాగుతున్న మరమ్మతు పనులు

**మహదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్‌లో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులను బుధవారం భారీ నీటిపారుదల శాఖ ఈఈ తిరుపతిరావు పర్యవేక్షించారు. పనుల తీరుపై అధికారులతో చర్చించారు. బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో కుంగిన పియర్ ఖాళీ ప్రదేశాలతో గ్రౌటింగ్ చేసేందుకు ప్రారంభించిన బోర్ హెూల్ పనులు, 20, 21 గేట్ కట్టింగ్, బరాజ్ దిగువన వరద ఉధృతితో ఎలాంటి ప్రభావం లేకుండా ఉండేందుకు ఇసుకలో కాపర్ షీట్ ఫైల్స్‌లను యంత్రాల సాయంతో అమర్చుతున్నారు. వరద నీటితో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు బరాజ్ ఎనిమిదో బ్లాక్ వరకు వరద నీటి ప్రవాహం రాకుండా మట్టి కరకట్ట పనులు జరుగుతున్నాయి. బరాజ్ దిగువన సీసీ బ్లాక్ అమర్చుతున్నారు. అప్‌స్టీమ్, డౌన్ స్టీమ్‌లో వరద నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఇసుక, రాళ్లను తొలగిస్తున్నారు.

## ఆధారాలన్నీ ధ్వంసం చేశాం


-మొదటి పేజి తరువాయి




వాంగ్మూలంలో వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ పర్యవేక్షణ కోసం 17 కంప్యూటర్లను వినియోగించామని... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రికార్డులను అన్నింటినీ ధ్వంసం చేశామని తెలిపారు. రికార్డులు ధ్వంసం చేసి వాటి స్థానంలో కొత్త వాటిని అమర్చినట్లు చెప్పారు. ధ్వంసం చేసిన ఆధారాలను నాగోల్, మూసరాంబాగ్ వద్ద మూసీలో పడేశామన్నారు. సీడీఆర్, ఐడీపీఆర్ డేటా మొత్తాన్ని కాల్చేసినట్లు చెప్పారు. ఫార్మాట్ చేసిన ఫోన్లు, పెన్ డ్రైవ్‌లను బేగంపేట నాలాలో పడేశామన్నారు. ఫోన్ ట్యాపింగ్ కోసం కన్వర్జెన్స్ ఇన్నోవేషన్ ల్యాబ్ సాఫ్టువేర్‌ను వినియోగించినట్లు చెప్పారు. 56 మంది ఎస్ఓటీ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు ట్యాపింగ్ చేశామని... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ట్యాపింగ్ ఆపేయాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఆయన రాజీనామా చేసే ముందు రికార్డులన్నింటినీ ధ్వంసం చేయాలని కూడా ఆదేశించినట్లు చెప్పారు. దాదాపు 1200 మంది ఫోన్లను ట్యాప్ చేసినట్లు ప్రణీత్ రావు వెల్లడించారు. ప్రధాన ప్రతిపక్ష నేతలపై నిఘా పెట్టామని, వారికి వెళ్లే డబ్బును అడ్డగించి పట్టుకునే వారమన్నారు. నేతలు, జడ్జిలు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు అంగీకరించారు. పదిహేడు హార్డ్ డిస్కులలో అత్యంత కీలక సమాచారం ఉందన్నారు.

# పిల్లలను విక్రయించే ముఠా...

**హైదరాబాద్ :** అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ దేశ వ్యాప్తంగా పసి పిల్లల అమ్మకాలు మాత్రం ఆగడం లేదు. సంతానం లేని తల్లిదండ్రులు లక్షలకు లక్షలు కుమ్మరించి కొంటున్నారు. అభంశుభం ఎరుగని చిన్నారులకు వెల కడుతున్నారు. ముక్కుపచ్చలారని పిల్లలను అంగట్లో సరుకులాగా కొంటున్నారు. కొందరు తల్లిదండ్రులు పిల్లలను పెంచే స్థోమత లేకనో లేక కాసులకు కక్కుర్తి పడో బిడ్డలను అమ్ముకుంటున్నారు. ఇటీవల కాలంలో బిడ్డల అమ్మకాలకు దళారులు కూడా ఏర్పడి లక్షలకు లక్షలు సంపాదించుకుంటున్నారు. పిల్లలు లేని తల్లిదండ్రులకు కాసుల ఆశ చూపించి నెలల రోజుల పిల్లలను కొనుగోలు చేస్తున్నారు. ఒకరి నుంచి మరొకరికి బిడ్డలను చేతులు మారుస్తు కాసులు సంపాదిస్తున్నారు. అలా కొనుగోలు చేసిన పిల్లలను కఠిన జీవితానికి బలి చేస్తున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో పిల్లల విక్రయాల ఘటన సంచలనం రేపుతోంది. పిల్లలను విక్రయిస్తున్న అంతరాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. 16 మంది చిన్నారులను మేడిపల్లి పోలీసులు కాపాడారు. రక్షించిన చిన్నారుల్లో తెలంగాణకు చెందిన వారే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన పిల్లలు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తాజాగా మేడిపల్లిలో పసికందు విక్రయంతో ఈ ముఠా ఆగడాలు బయటపడ్డాయి. మొత్తం 16 మంది పసి బిడ్డలను ఈ ముఠా విక్రయించినట్లు గుర్తించారు. ఫిర్జాదిగూడలో 4.5 లక్షల రూపాయలకు చిన్నారిని ఆర్ఎంపీ



శోభారాణి విక్రయించారు. ఆర్ఎంపీ, ఆమెకు సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొంత కాలంగా హైదరాబాద్ శివారులో పసి పిల్లల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మేడిపల్లి కేంద్రంగా చిన్నారుల అమ్మకాలు కొనసాగిస్తున్నారు. స్థానిక ఆర్ఎంపీ డాక్టర్ ఇతర రాష్ట్రాల నుంచి పిల్లల్ని తీసుకుని వచ్చి పిల్లలు లేని తల్లిదండ్రులకు అమ్ముతున్నారు. ఒక్కో పిల్లాడిని దాదాపు లక్ష నుంచి రూ. 5 లక్షల నగదుకు ఈ ముఠా విక్రయిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న బాలల హక్కుల సంఘం ఈ విషయాన్ని బట్టబయలు చేసింది. ఈ ముఠా ఆగడాలపై పోలీసులకు సమాచారం అందించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ముఠాను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో ఓ తల్లీకొడుకుతో పాటు ఇద్దరు ముఠా సభ్యులు ఉన్నారు. మరోవైపు పిల్లలను కొన్న పేరెంట్స్ పైనా పోలీసులు కేసులు నమోదు చేశారు. పిర్జాదిగూడ రామకృష్ణ నగర్‌లో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ అడ్డాగా మూడు నెలల పసికందు నుంచి ఏడాది పిల్లల వరకు అమ్మకాలు కొనసాగుతున్నాయి. 16 మంది చిన్నారులను ట్రేస్ చేసి పోలీసులు వారిని కాపాడారు. ఇప్పటి వరకు మొత్తం 50 మందిని అమ్మినట్లు పోలీసులు గుర్తించారు. అక్షర జ్యోతి ఫౌండేషన్ స్టింగ్ ఆపరేషన్‌లో ఈ అవాక్కయ్యే ఘటన వెలుగులోకి వచ్చింది. ఆర్థిక స్థోమత లేని తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వారిని పోషించడం మీకు భార మంటూ తల్లులకు చెప్పి.. మానవత్వంతో పిల్లలు లేనివారికి దత్తత ఇస్తామంటూ నమ్మించి విక్రయాలు చేస్తున్నారు.

**పోలీసులు పేర్కొన్న నిందితులు..**

1 శోభారాణి, 2 హేమలత అలియాస్ స్వప్న, 3 షేక్ సలీమ్ 4 బండారి హరి హర చేతన్ 5 బండారి పద్మ 6 బలగం సరోజ 7 ముదావత్ శారద 8 ముదావత్ రాజు 9 పఠాన్ ముంతాజ్ 10 జగనాదం అనురాధ 11 యాత మమత

# భయపెడుతున్న హోర్డింగ్‌లు

**హైదరాబాద్ :** వర్షాకాలం అంటే అందరికీ వెన్నులో వణుకే ప్రమాదం ఏ రూపంలో వస్తుందో తెలియని పరిస్థితి. ఇంటి నుంచి బయటకు వచ్చామంటే చాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిందే. నాలాలు, మ్యాన్‌హోల్స్, విద్యుత్ స్తంభాలు, ప్రహరీలు, సెల్లార్ గుంతలు, కరెంట్ తీగలు, కూలిపోయే చెట్లు ఇలా ప్రమాదాలకు నెలవుగా మారుతు న్నాయి. ఈ జాబితాలో హోర్డింగ్స్‌లు వచ్చి చేరాయి. గ్రేటర్‌లో వాణిజ్య ప్రకటనల కోసం ఏర్పాటు చేసే బోర్డులు 15 ఫీట్లకు తగ్గకుండా ఉండాలి. కానీ చాలా చోట్ల కొందరు అధికారుల ప్రమేయంతో నిబంధనలను ఉల్లంఘించి..హోర్డింగ్‌ల ఎత్తు పెంచినట్లు అరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా మెట్రో కారిడార్ లక్ష్యంగా సికింద్రాబాద్, హైటెక్ సిటీ ఇతర ప్రాంతాల్లో 15 ఫీట్లకు మించి హోర్డింగ్‌లు ఉండటం, ఈ క్రమంలోనే బలహీనమైన ఫ్లెక్సీలు చిరిగిపోయి వాహనదారులను, కరెంట్ స్తంభాలను కప్పేస్తున్నాయి. బలమైన ఈదురుగాలులతో హోర్డింగ్‌లు, కొట్టుకొస్తున్న ఫ్లెక్సీలతో స్థానికులతో పాటు వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో ఫ్లెక్సీలు విద్యుత్ తీగలపై పడుతుండటంతో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నదని టీఎస్ఎస్పీడీసీఎల్




అధికారులు చెబుతుండటం ఇందుకు నిదర్శనం.నగరంలో ఏర్పాటు చేసే హోర్డింగ్స్ ప్రజలకు ఎలాంటి ప్రమాదం కలిగించకుండా ఉండేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహించాలి. వ్యాపార ప్రకటనతో పాటు హోర్డింగ్ సామర్థ్యం పరీక్షించి సర్టిఫికెట్‌ను జారీ చేయాలి. కానీ ఆ దిశగా తనిఖీలు జరగడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 15 మీటర్ల వరకు ఉన్న హోర్డింగ్‌లు సైతం పక్కాగా.. నిబంధనల ప్రకారం నడపాల్సిన చోట సదరు ఏజెన్సీలు మెట్రో పిల్లర్లే లక్ష్యంగా అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా ధనార్జనే ధ్యేయంగా హోర్డింగ్‌ల ఏర్పాటు చేస్తూ నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు.ఈ తరహా సర్దార్ పటేల్ రోడ్ (శివాజీనగర్), సైబర్ సిటీ టవర్, శిల్పారామం రోడ్ ఇలా కొన్ని చోట్ల అర్ధరాత్రి పూట వయా డక్ట్ హోర్డింగ్ పనులు జరుపుతున్నారు. ఈ పనులను పర్యవేక్షించే అధికారులు లేరు. ప్రమాదకర స్థాయిలో ఈ పనులు జరుగుతున్నాయన్న అరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా బలహీనమైన ఫ్లెక్సీలతో ఇబ్బందులు వస్తున్నాయని గ్రేటర్ విద్యుత్ అధికారులు చెబుతున్నారు. కరెంట్ తీగలపై ఫ్లెక్సీలు పడుతుండటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నదని, ప్రమాదకర హోర్డింగ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు.

# నకిలీ విత్తనాలు



**అదిలాబాద్ :** ప్రతి ఏడాది నకిలీ విత్తనాలు ఇబ్బందులు పెడుతూనే ఉన్నాయి. ప్రతీ వానాకాలంలో నాసిరకం, నకిలీ విత్తనాల బెడద రైతులకు పెను సవాల్‌గా మారింది. ఫర్టిలైజర్ వ్యాపారుల మాయజాలంతో రైతులు మోసపోతున్నారు. ధనార్జనే ధ్యేయంగా కొందరు ఈ దందాను సాగిస్తుంటే? అసలు ఏదో, నకిలీ ఏదో గుర్తించలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వానాకాలం సీజన్‌కు ముందే గ్రామాల్లో తిష్ఠ వేసి రైతులను నట్టేట ముంచుతున్నారు. అమాయక రైతులే టార్గెట్‌గా ఈ ముఠాలు చెలరేగిపోతున్నాయి. అనుమతి లేని విత్తనాలు అన్నదాతలకు అంటగడుతూ అందినకాడికి దండుకుం టున్నాయి. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది సైతం అదే రిపీట్ అయింది.నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వార్నింగ్ ఇస్తున్నా? ఎక్కడ కూడా నకిలీగాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ కేంద్రంగా నకిలీ ముఠా రెచ్చిపోయింది. హుస్నాబాద్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు నిర్వహించి? 9 క్వింటాళ్ల 72 కిలోల నకిలీ విత్తనాలు సీజ్ చేశారు. వేణు అనే వ్యక్తి సరఫరా చేసినట్టు గుర్తించారు. అంతేకాదు సాకేత్, రేవంత్ రకం విత్తనాలకు భారీ డిమాండ్ ఉండటంతో ధరలు పెంచి రైతులను దోచుకుంటు న్నారు. అటు మిర్యాలగూడలో 5లక్షల విలువ చేసే నకిలీ విత్తనాలను సీజ్ చేశారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మరొకరు పరారీలో ఉన్నారు.మరోవైపు సీజన్ ఆరంభంలోనే విత్తనాల కొరత ఏర్పడింది. డిమాండ్‌కి తగ్గట్టు సరఫరా లేకపోవడంతో విత్తనాల కోసం.. రైతులు ఆగ్రో కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. కామారెడ్డి జిల్లాలో 5లక్షల 30 వేల ఎకరాల్లో పంటలు సాగు అవుతుందని అధికారులు అంచనా వేశారు.. రైతుల కోసం 10వేల 300 మెట్రిక్ టన్నుల జిలుగు, 2వేల 366 క్వింటాళ్ల జనుము, 50 వేల 900 క్వింటాళ్ల యూరియా అవసరం అవుతుంది. కానీ, ఇప్పటివరకు ఇందులో సగం కూడా రైతులకు అందలేదు. ఎరువులు, విత్తనాల పంపిణీలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. సరిపడా విత్తనాలు అందక నానా పాట్లు పడుతున్నారు.ఈ సీజన్‌లో ప్రారంభంలోనే భారీగా నకిలీ విత్తనాలను వివిధ శాఖల అధికారులు పట్టుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. ఓవైపు అక్రమార్కులపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నా మరోవైపు అనుమతిలేని విక్రయాలు విస్తుగొలుపుతున్నాయి. మరింత అప్రమత్తం కాకపోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని గత అనుభవాలు హెచ్చరిస్తున్నాయి.

# టెక్నాలజీకి గ్లోబల్ డెస్టినేషన్

**హైదరాబాద్ :** టెక్నాలజీకి గ్లోబల్ డెస్టినేషన్ మన హైదరాబాద్.. ఇప్పుడింత ఎలివేషన్ ఎందుకంటే.. ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ కొలువులు చేసే వారి మెడపై కత్తి వేలాడుతుంటే.. మన భాగ్యనగరం మాత్రం.. కొత్తవారిని రిక్రూట్ చేసుకోవడంలో దుమ్ము రేపింది..ప్రస్తుతం ఐటీ రంగంపై జరుగుతున్న ప్రచారం ఏంటి? ఐటీ రంగం పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ప్రతి కంపెనీలో ఉద్యోగాలను తొలగిస్తున్నారు. రిక్రూట్ చేసుకునే కంపెనీలు కూడా చాలా ఆచి తూచి చేపడుతున్నాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితి.. ఇండియాలో అయితే జాబ్ రిక్రూట్‌మెంట్స్ ఏకంగా 4 శాతం తగ్గాయి. బట్.. మన హైదరాబాద్ సిట్యువేషన్ కంప్లీట్ రివర్స్.. ఐటీ జాబ్స్ హైరింగ్‌లో దూసుకుపోతుంది. ఇండియా సిలికాన్ వ్యాలీగా పిలిచే బెంగళూరు కంటే ముందుంది. 2023 ఏప్రిల్ నుంచి 2024 మధ్య కాలంలో హైదరాబాద్ ఐటీ ఉద్యోగాల పోస్టింగ్స్ .. 41.5 శాతం పెరిగింది? అదే బెంగళూరులో కేవలం 24 శాతం మాత్రమే..ఐటీ ఉద్యోగాలు ఆశించే వారికి ఈ రెండు నగరాలే హైలైట్‌గా కనిపిస్తున్నాయిజాబ్ మ్యాచింగ్,జాబ్ హైరింగ్ సంస్థ ఇండీడ్.. 2023 ఏప్రిల్ నుంచి 2024 ఏప్రిల్ మధ్య కాలంలో జాబ్ పోస్టింగ్స్ అండ్ జాబ్ క్లిక్స్ నుంచి ఈ డేటాను కలెక్ట్ చేసి అనలైజ్ చేస్తే ఈ వివరాలు తెలిశాయి.. అంతేకాదు హైదరాబాద్‌లో ఇంపార్టెంట్స్ ఇచ్చేవారి సంఖ్య ఏకంగా 161 శాతం పెరగగా.. బెంగళూరుపై ఇంట్రెస్ట్ చూపేవారి సంఖ్యలో 80 శాతం పెరిగింది. ఈ ట్రెండ్‌ను చూస్తే హైదరాబాద్ టెక్ ఎకో సిస్టమ్ ఎదుగుతుందని క్లియర్ కట్‌గా అర్థమవుతోంది.మరి హైదరాబాద్‌లోనే ఎందుకు రిక్రూట్‌మెంట్స్ ఎందుకు పెరుగుతున్నాయి? దీనికి మూడు రిజన్స్ ఉన్నాయి.. ఫస్ట్ రిజన్.. వర్ల్డ్ క్లాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. యస్.. హైదరాబాద్‌లో ఒక్కసారి టూర్ వేసిన వారికి ఇది ఈజీగా అర్థమవుతోంది.. మల్టీ నేషనల్ కంపెనీలకు కావాల్సిన అన్ని వసతులు మన హైదరాబాద్‌లో వడ్డించిన విస్తరిలాగా అందుబాటులో ఉంటాయనడంలో ఎలాంటి డౌట్స్ లేవు.. సెకండ్ రిజన్.. హైల్లీ స్కిల్డ్ టాలెంట్ అందుబాటులో ఉండటం. తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రెస్టేజీయస్ ఇన్‌స్టిట్యూట్స్ ఉన్నాయి మనకు.. ఇక్కడి నుంచి సూపర్ టాలెంట్‌తో పాటు.. హైల్లీ స్కిల్డ్ స్టూడెంట్స్‌ను హైర్ చేసుకుంటున్నారు రిక్రూటర్స్.. దీంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న వారందరి చూపు హైదరాబాద్‌వైపే ఉండటం కూడా మరో రీజన్.. ఇక థర్డ్ రీజన్.. ఫుల్‌గా సపోర్ట్ చేసే గవర్నమెంట్.. హైదరాబాద్‌లో కంపెనీ పెట్టాలని ఎవరైనా అనుకుంటే చాలు సింగిల్ విండో పద్ధతిలో పర్మిషన్స్ దొరకుతాయి.. ఇది కూడా హైదరాబాద్‌లో కంపెనీలను ఎస్టాబ్లిష్ చేసేందుకు ఓఔఅలను అట్రాక్ట్ చేస్తోంది.రిక్రూట్‌మెంట్స్ పెరుగుతున్నాయి ఓకే.. బట్ ఏఏ టెక్నాలజీకి సంబంధించి రిక్రూట్ చేసుకుంటున్నారు..? ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న టాప్ ఫైవ్ టెక్నాలజీలు ఏంటి? ఈ డిటెయిల్స్ ఓ సారి చూద్దాం.. అనాలసిస్ స్కిల్స్.. 5.51 పర్సెంట్.. అజైల్ 5.39 పర్సెంట్.. ంఖఎ.. 4.5 పర్సెంట్ జావా స్క్రిప్ట్.. 4 పర్సెంట్ ాఖిఇ.. 4 పర్సెంట్.. సో సాఫ్ట్‌వేర్ రంగంలో సెటిల్ అవ్వాలనుకుంటున్న వాళ్లు వీటిపై కాస్త ఫోకస్ చేయండి.. ఇంకా బాగా సెటిల్ అవ్వాలనుకుంటున్న వాళ్లు ఏఐ టెక్నాలజీలపై ఫోకస్ చేస్తే.. భారీ జీతాలతో ఉద్యోగాలు సంపాదించవచ్చని చెబుతున్నారు ఐటీ ఎక్స్‌పర్ట్స్.. ఇప్పుడు హైదరాబాద్ మరో అడుగు ముందుకు వేయబోతుంది. హైటెక్ సిటీ తరహాలో మరో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ సిటీని ఏర్పాటు చేయాలని గవర్నమెంట్ డిసైడ్ అయ్యింది. ఔటర్ రింగ్ రోడ్డుకు ప్యారలల్‌గా 200 ఎకరాల భూమిని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ అధికారులు ఇప్పటికే గుర్తించారు. 2030 వరకు ఏఐ మార్కెట్‌లో 37.3 పర్సెంట్ వృద్ధి రేటుతో విస్తరిస్తుందని అంచనాలు ఉన్నాయి.

## తాండూర్ ఎస్సైగా కిరణ్ కుమార్ బాధ్యతలు స్వీకరణ



**వాస్తవ నేస్తం,బెల్లంపల్లి:** తాండూర్ సబ్ ఇన్స్ పెక్టర్ గా చిలుముల కిరణ్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు మంచిర్యాల సిసిఎస్ లో ఉన్న కిరణ్ కుమార్ కు తాండూర్ లో పోస్టింగ్ ఇచ్చారు. గతంలో భీమిని, తాళ్లగురజాల, తాండూర్ ఎస్సైగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు అందరూ సహకరించాలని కోరారు. చట్టం ముందు అందరు సమానమేనని అన్నారు. పేకాట, జూదం, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతానన్నారు.

## అనారోగ్యంతో యూవ రైతు మృతి

**వాస్తవనేస్తం,బజార్హతనూర్:** మండలానికి చెందిన ఒక యువరైతు అనారోగ్యంతో మృతి చెందాడు. మండలంలోని చందునయక్ తండాలో యూవ రైతు పద్వాల్ లగాజిరాం గత నాలుగు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం డాక్టర్ లు పరీక్షించి ప్లేట్లెట్స్ తగ్గాయి అనడంతో మెరుగైన వైద్యం కోసం నాగపూర్ లో తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## టేకుల కుంట కూల్చివేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తాసిల్దార్‌కు వినతి



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** జిన్నారం మండలం ఉట్ల గ్రామానికి చెందిన టేకులకుంటను కూల్చివేసిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. గత వారం ఉపాధి హామీ పథకం కింద కూలీలు కట్ట పోయడం జరిగింది. కులిపని డబ్బులు రాకముందుకే కట్ట కూల్చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు తెలిపారు. స్థానిక ఇరిగేషన్ ఏఈ అటువంటి సమాచారం ఇవ్వకుండా వచ్చినట్టే వచ్చి చాటు మార్గాన కుంటను పరిశీలించడం జరిగింది. మత్స్యకారుల ఆవేదం పట్టించుకుకొని ఏఈ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## చాకరిమెట్ల ఆంజనేయ స్వామిని దర్శించుకున్న నీలం మధు



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** నర్సాపూర్ నియోజకవర్గంలో ఆధ్యాత్మికంగా ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామి వారిని మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్,మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, మదన్ రెడ్డి,డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, ఇంచార్జ్ ఆవుల రాజీరెడ్డి గార్లతో కలిసి దర్శించుకున్నారు. శ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి ఆదేశానుసారం ఆలయంలో నిర్వహించిన మహారుద్రం, సహస్ర శ్రీ సూక్తం, సహస్ర మన్యు సూక్తం,పురుష సూక్తం, లక్ష తమలార్చన, శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం పూజలు అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ ప్రత్యేక పూజలలో నీలం మధు పాల్గొని స్వామి వారి సేవలో పాల్గొన్నారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామి ఆశీస్సులతో మెదక్ పార్లమెంటు నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా, కమల పుల్ సింగ్,మండల అధ్యక్షులు మల్లేష్,సుదర్శన్ గౌడ్,మాజీ ఎంపీపీ లాలిత, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అంతా ఆహార తనిఖీలు

**ఖమ్మం :** ఖమ్మం, మేడ్చల్ జిల్లాలోను ప్రముఖ హోటల్స్, రెస్టారెంట్లపై ఆకస్మిక తనిఖీలు చేశారు ఫుడ్ సేఫ్టీ అధికారులు. కుళ్ళిన కబాబులు, ఎక్స్‌పైరీ మసాల దినుసులు సీజ్ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులతో హోటల్స్, రెస్టారెంట్ల యాజమానులు హడలిపోతున్నారు. .ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతన్న పేరు మోసిన రెస్టారెంట్లు, హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారుల మెరుపు దాడులు కొనసాగుతున్నాయి. గతం వారం రోజులుగా హైదరాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రముఖ హోటల్స్, రెస్టారెంట్‌లపై రైడ్స్ చేసి వాటి భాగోతం బట్టబయలు చేస్తున్నారు. లొట్టలేసుకొని లాగించే ఫుడ్ ప్రియుల కళ్లు తెరిపిస్తున్నారు. హోటల్స్, రెస్టారెంట్స్‌లో జరుగుతున్న వాస్తవి పరిస్థితిని ప్రజల కళ్లకు కడుతున్నారు. ప్రముఖ రెస్టారెంట్లు, హోటళ్లపై మెరుపు దాడులు చేసి కాలం చెల్లిన ఫుడ్, వస్తువులు, నూనె సీజ్ చేస్తున్నారు. రీసెంట్ గా మేడ్చల్‌లోని తాజా హాలిడే రెస్టారెంట్‌లో తనిఖీలు చేశారు. స్టోర్ రూమ్‌లో ఫుడ్ కలర్స్ గుర్తించారు అధికారులు. అలాగే కుళ్లిపోయిన కూరగాయలు, నిమ్మకాయలు గుర్తించారు. లేబుల్ లేని టీపొడి, పురుగులు పట్టిన కొర్రలు సీజ్ చేశారు. అంతేకాకుండా వట్టినాగులపల్లి ప్రిజం రెస్టారెంట్, బార్‌లో తనిఖీలు చేశారు అధికారులు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com